## స్పందనకు 185 అర్జీలు

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంను ఈ వారం జిల్లా నలుమూల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై 185 అర్జీలను కలెక్టర్ హరినారాయణ్, జిల్లా అధికారులకు సమర్పించారు. ఈ సమస్యలను పరిశీలించిన కలెక్టర్ సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌డేలో రెవెన్యూకు సంబంధించి 110, సర్వే శాఖ 28, హౌసింగ్ 15, వైద్య ఆరోగ్యశాఖ 6, పోలీసు 5, విద్యుత్ శాఖ 4, ఇతర శాఖలకు సంబంధించి 17 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## జ్యోతిబా పూలేకు మంత్రి రోజా నివాళి

నగరి, నవంబరు 28 ప్రభాతవార్త :



సామాజిక విప్లవకారుడు జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా స్థానిక డిగ్రీ కాలేజీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ, సమాజంలో మూఢ విశ్వాసాలు, అంటరానితనంపై పోరాటం సాగించిన మహనీయుడని కొనియాడారు.

# సర్వపాపహరణం పంచమితీర్థం

### వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి చక్రస్నానం

### కనులవిందుగా సిరుల తల్లికి స్నపన తిరుమంజనం - పద్మ పుష్కరిణి స్నానంతో తన్మయత్వం చెందిన భక్తులు



శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ధ్వజఅవరోహణం నిర్వహిస్తున్న అర్చకులు



తిరుచానూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:

శ్రీ పద్మావతి అమ్మవారు అవతరించిన పంచమి తిథిని పురస్కరించుకుని కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం పంచమితీర్థం(చక్రస్నానం) అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో స్నానమాచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ఉదయం 6-30 నుండి 7-30 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారు పల్లకిలో ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం అమ్మవారికి ఆస్థానం నిర్వహించి ఉత్సవర్లను ఊరేగింపుగా పంచమి తీర్థ మండపానికి వేంచేపు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద తెల్లవారు జామున 4-30 గంటలకు బయలుదేరిన సారె ఉదయం 11 గంటలకు తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అర్చకులు పంచమి తీర్థ మండపంలో సారెను అమ్మవారికి సమర్పించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచమితీర్థం సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి కానుకలు పంపారు. 25 లక్షల రూ॥లు విలువ చేసే 500 గ్రాముల బరువు గల రెండు పతకాలు, ఒక హారం, సారెతో పాటు తిరువీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. ఉదయం 11-40 నుండి 11-50 గంటల మధ్య పంచమితీర్థం(చక్రస్నానం) ఘట్టం ఘనంగా జరిగింది. చక్రత్తాళ్వార్‌తో పాటు పెద్దసంఖ్యలో వచ్చిన భక్తజనం పద్మ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

**శోభాయమానంగా సిరులతల్లి స్నపన తిరుమంజనం::**

పంచమి తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు ఉదయం 10 నుండి 11-30 గంటల వరకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో తేనె, పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. కుంకుమపువ్వు, అత్తిపండు, బాదం, జీడిపప్పు, నెల్లికాయలు, రోజా, తులసి మాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన షణ్ముగ సుందరం, బాలసుబ్రహ్మణ్యన్‌లు ఈ మాలల తయారీకి విరాళం అందించారు. పంచమి మండపం వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప మండపంవిశేషంగా ఆకట్టుకుంది. ఇందులో ఆపిల్, ఆస్ట్రేలియా ఆరంజ్, తామర పూలు, రోజాలు, లిల్లీలు, కట్ ఫ్లవర్స్, సాంప్రదాయ పుష్పాలతో గార్డెన్ సిబ్బంది అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. రాత్రి 7-30 నుండి 8-30 గంటల వరకు బంగారు తిరుచ్చి వాహనంలో అమ్మవారి ఉత్సవర్లను ఊరేగించారు. అనంతరం రాత్రి 9-30 నుండి 10-30 గంటల వరకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. జీయ్యర్ స్వాములు, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దంపతులు, ఈఓ ధర్మారెడ్డి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే, బోర్డు సభ్యుడు సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, రామేశ్వరరావు, ముర్రంశెట్టి రాములు, మారుతిప్రసాద్, టిటిడి మాజీ బోర్డు ఛైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, సివిఎస్ఓ నరసింహకిషోర్, సిఈ నాగేశ్వరరావు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వామినుంచి శాస్త్రోక్తంగా సారె !

### మురిసిన సతి పద్మావతి



తిరుమల, నవంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దేవేరి తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి సోమవారం ఉదయం పసుపు, కుంకుమ, పూలు, ప్రసాదాలు, తులసీ, వస్త్రాలు, అభరణాలతో సారెను తిరుమల నుంచి తీసుకెళ్ళారు. అమ్మవారి కార్తీకమాస బ్రహ్మోత్సవాల్లో చివరగా సోమవారం ఉదయం జరిగిన పంచమీతీర్థంకు ఆనవాయితీగా సారె పంపడం జరుగుతుంది. ఉత్సవాల్లో చివరగా జరిగే పవిత్రమైన పంచమీతీర్థం రోజున తన పతినుంచి అందే సారెతో పద్మమ్మ మురిసిపోయారు. భక్తిశ్రద్ధలతో సారెను తలపై పెట్టుకుని గజరాజులు ,వేదపండితులు, అర్చకులు, పరిచారకులు ముందు నడుస్తుండగా టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు సోమవారం వేకువజామున 4.30గంటలకు తిరుమల నుంచి బయలుదేరారు.

### శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి

## పోటెత్తిన శివభక్తులు

### అంచనాలకు మించి అభిషేకాలు: రెప్పపాటు దర్శనంతో సరి



రాహుకేతు పూజలకు నిరీక్షిస్తున్నభక్తజనం

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి శివభక్తులు పోటెత్తుతున్నారు. ఆలయం కిట కిట లాడుతుంది. సోమవారం శ్రీకాళహస్తి 'జన జాతరగా' మారింది. ఇక స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తుల తిప్పలు తప్పలేదు. అడుగడుగునా దళారుల దందా. అడ్డదారి దర్శనాలతో ఆలయంలో గందరగోళ పరిస్తితి చోటు చేసుకుంది. ఆలయంలో సంప్రదాయ దుస్తుల అమలు ప్రశ్నార్థకంగా మారింది. సంస్కరణలు ప్రకటనలకే పరిమితం అన్నట్లు మారింది. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారులు రాజకీయ ముసుగులో కొనసాగుతుండటంతో అడ్డదారి దర్శనాలను ప్రశ్నించిన ఉద్యోగులతో పేచీలు, భక్తుల ముందే బాహాబాహికి పాల్పడుతుండటంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

**శివనామస్మరణతో పునీతమైన శ్రీకాళహస్తి:**

ఆదివారం సుమారు 30వేల మంది వరకు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి తరలి వచ్చారు. సోమవారం వేకువ జాము నుంచి పట్టణంలో జనం జాతరగా మారింది. ఓ వైపు బస్సులు, మరో వైపు రైళ్ళు, ఇంకో వైపు తమ సొంత కార్లలో జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. దీనికి తోడు శబరిమలకు వెళ్ళు భక్తులు తిరిగి వచ్చే భక్తులతో ఆలయం కిట కిట లాడింది. ఆదివారం అటు కర్నాటక, ఇటు తమిళనాడుల నుంచే కాకుండా ఉత్తర భారత దేశం నుంచి కూడా జనం పోలోమని తరలి వచ్చారు. దాంతో ఆలయంలో భక్తుల సందడి చోటు చేసుకుంది. ఓ వైపు రాహుకేతుదోష నివారణ పూజల భక్తులు, మరో వైపు స్వామి అమ్మవార్ల దర్శనాలకు వచ్చే భక్తులతో ఆలయం కిట కిట లాడింది.

**లెక్కకు మించి అభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరుడు అభిషేక ప్రియుడంటారు. సోమవారం వచ్చిన భక్తులు అభిషేకాలు చేయించుకోవటానికి చొరవ చూపారు. దాంతో అధికారులు వచ్చిన భక్తులను నిరాశ పరచకుండా అనుమతించారు. దాంతో అభిషేకాలు కూడా రన్నింగ్ దర్శనాలకే పరిమితమయ్యారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగువేలు తాకాయి. అభిషేకాలు 128కు చేరుకోగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 45 జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణంగా ఒక కాలానికి అభిషేకాలకు పది మందిని అనుమతిస్తే అభిషేకం జరిగినంత సేపు దర్శించుకోవచ్చు. కానీ అందరికి అవకాశం లెక్కల్లో ఒక్కొక్క కాలానికి కనీసం పాతిక మందిని అనుమతించటంతో గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. ఆలయంలో అడ్డదారుల దర్శనాలు, దళారుల దందాపై అధికారులు పెదవి విప్పని పరిస్థితి చోటు చేసుకుంది. దాంతో దళారులు తమ జేబులను నింపుకుంటూ శివయ్యకు పంగనామాలు పెడుతున్నారు. మరి ఈ దారుణాలకు చెక్ ఎప్పుడు పడుతుందో ఏమో అని పరిశీలకులు శివయ్యకే అప్పగిస్తున్నారు.

**ఐదువేల రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం సుమారు నాలుగువేలు రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. ప్రత్యేక విఐపిల పూజలు కూడా 50 జరిగాయి. వచ్చిన భక్తులు సత్వర సుదర్శనం కోసం దళారులను ఆశ్రయించక తప్పలేదు.

## రైతు శ్రేయస్సే లక్ష్యంగా పాలన

### 3వ విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద

### 31,777 మంది రైతులకు రూ.8.47 కోట్లు జమ : - జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:

రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతు శ్రేయస్సే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి సోమవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడవ విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలోని 37,777 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలకు 8.47 కోట్ల రూపాయల మొత్తంను వర్చువల్ విధానంలో జమ చేసి అనంతరం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రైతు పక్షపాతిగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ఒక లక్ష రపాయల లోపు పంట రుణం పొంది ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతుకు ప్రభుత్వం వడ్డీ రాయితీని అందిస్తోందన్నారు. 2020-21 సంవత్సరంలో రుణాలు తీసుకొన్న 6,595 రైతులకు 1.70 కోట్ల రూపాయలు, 2021 ఖరీఫ్‌లో రుణాలు పొందిన 12,925 మంది రైతులకు 3.48 కోట్ల రూపాయలు, అలాగే గత ఏడాది వడ్డీ రాయితీ జమ కాని 12,257 రైతులకు 3.29 కోట్ల రూపాయలు సోమవారం సిఎం వైఎస్ జగన్ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారన్నారు. అలాగే 2019-20 సంవత్సరం నుండి ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.

### జిల్లా రైతుల ఖాతాల్లోకి

## రూ.5.20కోట్లు జమ

### తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో 23951 మంది రైతుల ఖాతాల్లోకి రూ.5.20కోట్ల రుపాయాలను జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. రబీ 2020-21, ఖరీఫ్ 2021 సున్నా వడ్డీ, ఖరీఫ్ 2022 పంట నష్ట పరిహారం కింద చెల్లించడం జరిగిందన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాల వడ్డీ రాయితీని అర్హత కలిగిన రాష్ట్ర రైతుల ఖాతాల్లోకి దాదాపు రూ.200కోట్ల రుపాయాలను జమ చేసారన్నారు. జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు లక్ష వరకు పంట రుణాలు పొంది, సకాలంలో చెల్లించినవారికి వడ్డీరాయితీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2019 నుండి అమలు చేసి రైతులను ఆదుకొంటుందన్నారు. ప్రకృతి వైఫరిత్యాలలో పంట నష్టపోయిన రైతులకు పరిహారంగా ఇన్పుట్ సబ్సీడి అందిస్తుందని, అందులో భాగంగా నేడు 23951 మంది రైతుల ఖాతాలకు రూ.5.20 కోట్లు జమ చేసారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం : మంత్రి రోజా

నగరి, నవంబరు 28 ప్రభాతవార్త :

క్రీడల వల్ల శారీరకంగానే కాకుండా మానసిక ధృఢత్వం కూడా పెరుగుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. సోమవారం స్థానిక కెవికె మైదానంలో జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాలను ఎంపి రెడ్డెప్పతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు పెట్టడమే కాకుండా గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, జోన్ స్థాయిలో గెలుపొందిన జట్లకు డిసెంబరు 21వ తేదీన జగనన్న పుట్టినరోజున రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విజేతలకు రూ. 50 లక్షల మేరకు బహుమతులు అందిస్తామన్నారు. రాష్ట్రంలో యువతను ప్రభావితం చేసే యూత్ ఐకాన్‌గా జగన్ వున్నందున ఆయన జన్మదినం పురస్కరించుకుని క్రీడా సంబరాలు చేస్తున్నామన్నారు. రాష్ట్రం ఆరోగ్యంగా వుండాలంటే యువకులు బాగా చదువుకోవాలి, ఆరోగ్యంగా వుండాలని ముఖ్యమంత్రి ఆలోచించారని అందువల్లే విద్య, వైద్య, క్రీడా రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.

**రూ. 50 లక్షలతో చిత్తూరులో స్టేడియం**

క్రీడాకారులను ప్రోత్సహించడంలో తన వంతు పాత్రగా చిత్తూరులో స్టేడియం నిర్మాణానికి రూ. 50 లక్షలు అందించినట్టు ఎంపి రెడ్డెప్ప తెలిపారు. రెండేళ్లుగా స్టేడియం నిర్మాణం





కబడ్డి, క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న మంత్రి రోజా

జరుగుతోందని త్వరలోనూ పూర్తవుతుందన్నారు. శాప్ మేనేజింగ్ డైరక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల శాఖ మంత్రి రోజా ప్రభుత్వంతో చర్చించి క్రీడాభివృద్ధికి గతంలో లేని విధంగా ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించడానికి జగనన్న స్పోర్ట్స్ యాప్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి రోజా కబడ్డీ, క్రికెట్ ఆటలను క్రీడాకారులతో కలిసి ఆడి అందరికీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి డిఇఓలు విజయేంద్ర, శేఖర్, ఆర్డిఓ సుజన, సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ, మేనేజర్ మురళి, నగరి, పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్లు నీలమేఘం, ఎ.హరి, పుత్తూరు మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ (చిట్టి), నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైకాపా ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావ్ పూలే వర్ధంతి

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జ్యోతిరావు పూలే 132వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, చిత్తూరు జిల్లా 'దేశం' బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డిలు పూలమాల వేసం ఘంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా దేశం అధ్యక్షుడు పులివర్తినాని, బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డిలు మాట్లాడుతూ బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందడుగు వేయడానికి జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేశం ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, దేశం కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, మొదలియార్ సాధికారిత కమిటీ అధ్యక్షుడు



త్యాగరాజన్, బీసీ నాయకులు ఈశ్వర్, ముదిరాజ్, మురుగన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీంల ఆత్మాభిమానం దెబ్బతినేలా వైకాపా చర్యలు

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:



ముస్లీం మహిళల ఆత్మాభిమానం దెబ్బతినేలా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తిస్తున్నారని కుప్పం ముస్లీం మైనార్టీలు ధ్వజమెత్తారు. ఇటీవల నరసాపురంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు నల్ల బురఖాలు వేసుకొని వెళ్ళిన ముస్లీం మహిళలను అక్కడి భద్రతా సిబ్బంది బురఖాలు తీసి రావాలని చెప్పడంతో ముస్లీంల ఆత్మాభిమానం దెబ్బతిన్నద న్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కుప్పం ముస్లీం మైనార్టీ నాయకులు డిఆర్ఓ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఉమర్‌షేక్, కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ఘనివుల్లా, జిల్లా మైనార్టీ సభ్యుడు అబ్దుల్ మునాఫ్, నాయకులు ఆదిల్, బూత్ కన్వీనర్ జాహిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: తెలంగాణా రాష్ట్ర ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు కలవకుంట్ల విద్యాసాగర్‌రావు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## సంఘ సంస్కర్త జ్యోతిరావ్ పూలే - తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పంరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త



దేశంలో సంఘ సంస్కరణోద్యమానికి, వెనుకబడిన వర్గాల ఉన్నతికి మహాత్మా జ్యోతిరావ్ పూలే కృషి చేశారని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మురళి అధ్వర్యంలో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే జీవన ప్రస్థానం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. సమసమాజ స్థాపన, అంటరాని తనం నిర్మూలనే ధ్యేయంగా పనిచేశారన్నారు. స్త్రీ విద్యకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎంపిపి సాంబశివం, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, వేలు, జిఎం రాజు, ఉదయ్‌కుమార్, కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు సోమశేఖర్, సెల్వరాజ్, మురళి, లోకేష్, వసంతమ్మ, దయాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులకు ఆర్థికసాయం

రామకుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త

వృద్ధాప్యంతో బాధపడుతున్న దంపతులకు దాతలు ముందుకు వచ్చి తమవంతు సాయం అందించారు. గోవిందపల్లి గ్రామంలో శంకరప్ప, శుక్లమ్మ అనే వృద్ధదంపతులు ఉంటున్నారు. వీరికి ఉండేందుకు ఇల్లు సైతం లేకపోవడంతో దాతలు పలువురు స్పందించి పదివేల ఆర్థికసాయంతో పాటు ఐదువేల విలువ చేసే నిత్యావసర సరుకులను తమవంతు సాయంగా అందించారు.

## వైకాపా నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త

వైకాపా నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి బెదిరించి దౌర్జన్యాలు చేసి అధికారంలో రావాలనే రీతిలో ఉందన్నారు. నవరత్నాలు పథకాలు ఇచ్చి హామీలు 95శాతం పూర్తి చేశామని అంటున్న వైకాపా నేతలు మరి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. అనంతపురం వైకాపా నేత చంద్రశేఖర్ చంద్రబాబు, లోకేష్‌లపై మాట్లాడిన వ్యాఖ్యలు దారుణమని అలా మాట్లాడితే భయపడేది లేదన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, నాగరాజు, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, నాగరాజు, సింగిరి శ్రీనివాసులు, చంద్ర, నారాయణస్వామి, గోవిందరాజులు, భాస్కర్, ఆనంద్‌నాయుడు, చంద్రకళ, అనసూయ, సుగుణమ్మ, రూపహేమావతి, పొలారాణి, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

## లీజు పేరుతో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు స్వాహా.. : టిడిపి

పలమనేరు, నవంబర్ 28, ప్రభాతవార్త:



లీజు పేరుతో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను వైకాపా నాయకులు స్వాహా చేస్తున్నారని టిడిపి నాయకులు విమర్శలు చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని మదనపల్లె రోడ్డు వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ భూములను వైకాపా నాయకులు లీజు పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి తాకట్టు పెడుతుంటే స్థానిక వైకాపా నాయకులు ప్రభుత్వం భూములను లీజు పేరుతో కాజేస్తున్నారన్నారు. గంగవరంలో సివిల్ సప్లై భవనంను గతంలో ఓ వ్యక్తికి లీజులు ఇవ్వడం జరిగిందని ఇలా ప్రభుత్వం భూములను లీజు పేరుతో వ్యక్తులకు కట్టబెడితే రానున్న రోజులలో ప్రభుత్వం భవనాలు స్థలాలు ఉండవని, అధికారులు ఈ విషయాన్ని గుర్తించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిబాబు, సుబ్రమణ్యం గౌడు తదితరులు పాల్గొన్నారు.

## ఎపి పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వజన మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:

ఎపి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వజన మహాసభ పోస్టర్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 11వ తేదీ విజయవాడలో యూనియన్ సర్వజన మహాసభ జరుగనుందని ఈ సమావేశానికి వైద్య ఉద్యోగులందరు హాజరై సమస్యలపై గళం ఎత్తాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఎంపిహెచ్ఓ అండ్ సిహెచ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జ్ఞానశేఖర్, జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసమూర్తి, ఎపి పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి భోగిశ్వరపిళ్ళై, ఎపి ఎన్జీఓ సంఘ చిత్తూరు తాలుకా అధ్యక్షుడు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి -ఎంపీపీ రెడెడ్డప్ప.

పెద్దపంజాణి నవంబర్ 28 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండల అభివృద్దికి తాను శక్తివంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానని ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఆయన వివిధ అభివృద్ది కార్యక్రమాలను పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వెంకటేగౌడ ఆదేశాలతో మండలంలో అభివృద్ది పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో నాడు - నేడు పథకంలో భాగంగా పాఠశాలలను కార్పోరేట్ స్థాయికి అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో వలసల నివారణకు గాను ఉపాధిహామీ పనులను విస్తృతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీల అభివృద్దికి అన్నివిదాలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కరసనపల్లి పాఠశాలలో మధ్యాహన భోజన పథకాన్ని తనిఖీచేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలోని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు, కరసనపల్లి పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనుల నాణ్యతను పరిశీలించి త్వరితగిన పూర్తిచేయాలని సూచించారు. బట్టందొడ్డి, లింగాపురం సచివాలయంలను అకస్మికంగా తనిఖీచేసారు. ఆయన వెంట ఎంపిడీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు ఆద్యుడు మహాత్మా పూలే

### - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త



దేశంలో అణగారిన వర్గాలకు ఆద్యుడు మహాత్మాజ్యోతిరావ్ పూలే అని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో మహాత్మా పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మహిళలు, అణగారిన వర్గాల సమానత్వం కోసం పూలే పోరాట ం చేశారన్నారు. దేశంలో మహాత్మా అనే బిరుదు తెచ్చుకున్న మహనీయుడు పూలే అన్నారు. అంతకుముందు జ్యోతిరావ్ పూలే చిత్రపటంకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునసా్వమి, కమీషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్ ఎంఆర్ సురేష్, సలహాదారు ఆర్.శ్రీనివాసులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతిని మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపిడిఓ రాధాకృష్ణ తదితరులు పూలే చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల కార్యాలయంలో స్పందన కార్యక్రమం చేపడ్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జ్యోతిరావుపూలే ఆశయాల స్ఫూర్తితో సేవలందిద్దాం

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28, ప్రభాతవార్త



పూలే 132వ వర్ధంతి వేడుకలు సందర్భంగా సోమవారం ఉదయం పూలే విగ్రహానికి తిరుపతి పూలే - అంబేద్కర్ రాజ్యాధికార కమిటీ సభ్యులు స్టేట్ కోఆర్డినేటర్ షంషేర్ సయ్యద్ పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ పూలే జీవన ప్రస్థానం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. సమసమాజ స్థాపన, అంటరాని తనం నిర్మూలనే ధ్యేయంగా పనిచేశారన్నారు. స్త్రీ విద్యకు కృషి చేశారన్నారు. వితంతు వివాహాలపై పోరాట ం చేశారన్నారు. భావితరాలకు దిక్సూచిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మరో స్టేట్ కోఆర్డినేటర్ డా. పి.పరమశివన్‌తో పాటు పలువురు ముస్లిం సోదరులు, తిరుపతి అసెంబ్లీ కమిటీ సభ్యులు నందిపాటి చక్రపాణి, ఇంద్రముని, అశోకసామ్రాట్, రేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కరాటే పోటీల్లో విజేతలు





బంగారుపాళ్యం, నవంబర్ 18 ప్రభాతవార్త:

స్థానిక సరోజని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆదివారం తిరుపతి నందు అండర్-14 జిల్లా స్థాయి కరాటే పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన ఎం.లహరి, అత్తిక, తనూజ, అహ్మద్‌ఖాన్‌లు జిల్లా స్థాయిలో మొదటి, రెండ, మూడవ స్థానాలను కైవసం చేసుకొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా తరపున వీరు పోటీ పడుతారని కరాటే మాస్టర్ సురేష్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం కోమల రవీంద్ర, హెడ్మాస్టర్ నారాయణరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## వాహనాల వేలంతో రూ.1.03 లక్షలు ఆదాయం

పాలసముద్రం, నవంబర్ 28 ప్రభాతవార్త:

పాలసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, నాటు సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను చిత్తూరు ఎస్ఇబి ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి 1,03,000 రూపాయల ఆదాయం లభించిందని పాలసముద్రం ఎస్ఐ సురేష్ తెలిపారు. వెహికల్ ఇన్స్‌పెక్టర్లు ఖరారు చేసిన ధర మేరకు వాహనాల ఖరీదు 73 వేల రూపాయలు, అదనంగా 80 శాతం జిఎస్టీగా నిర్ణయించి వేలం నిర్వహించడం జరిగిందన్నారు. వేలం పాటదారులు 1.03 లక్షల రూపాయల వరకు వేలం పాట పాడి వాహనాలను కైవసం చేసుకొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురుగేష్, చక్రవర్తిలు, హెడ్‌కానిస్టేబుల్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గాపురం పంచాయతీలో వీధి దీపాల వెలుగులు

పాలసముద్రం, నవంబర్ 28 ప్రభాతవార్త:

పాలసముద్రం వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో గత మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని ఆన్‌లైన్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. ఇన్‌ఛార్జీ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నరేష్ పంచాయతీ పరిధిలోని 21 విద్యుత్ దీపాలను మరమ్మత్తులు చేసి వెలిగేలా చర్యలు తీసుకొన్నారు. గత మూడు నెలలుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న గ్రామాల్లో ప్రస్తుతం రాత్రి సమయాల్లో వెలుగు నిండింది. తన ఫిర్యాదుతో స్పందించి వీధి దీపాలను మరమ్మతులు చేసిన అధికారులకు జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలకు రూ.50 వేలు విరాళం

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:

జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలకు జిల్లా పండ్ల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌రెడ్డి, గోవర్ధన్‌బాబీలు సోమవారం కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి 50 వేల రూపాయల చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించి ముందుకు రావడం అభినందనీయమని వారిని అభినందించారు.

## పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా తలపులపల్లె బాబురెడ్డి

పూతలపట్టు, నవంబర్ 28 ప్రభాతవార్త:

సత్యసాయి జిల్లా పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా పూతలపట్టు మండలంకు చెందిన వైకాపా సీనియర్ నాయకులు తలపులపల్లె బాబురెడ్డిని నియమిస్తూ సోమవారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబుల సహకారంతో వైఎస్సార్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పేట అగ్రహారంకు చెందిన వైకాపా నాయకుడు రవినాయుడు ఆధ్వర్యంలో బాబురెడ్డిని సన్మానించారు.

## తెదేపా సీనియర్ నాయకులను పరామర్శించిన మాజీ మంత్రి.

పెద్దపంజాణి నవంబర్ 28 ప్రభాతవార్త :

మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆరోగ్యరాజు, మిడిగేసి సుబ్రమణ్యంలను మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి పరామర్శించారు. సోమవారం పెద్దపంజాణి మండలంలోని శివాడి గ్రామంలో గత కొంత కాలంగా అనారోగ్యంతో తెదేపా సీనియర్ నాయకులు ఆరోగ్యరాజు, మిడిగేసి సుబ్రమణ్యంలు బాధపడుతుండగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వారి నివాసానికి చేరుకున్నారు. ఈ మేరకు వారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికుటుంబసభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఏదైనా అవసరంవుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు ఆనంద్, తెదేపా మండల జనరల్ సెక్రటరీ చలపతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగరాజురెడ్డి, మురహరి రెడ్డి, లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి, వేమారెడ్డి, గంగప్ప, వేణుగోపాల్ నాయుడు, కృష్ణారెడ్డి మండల స్థాయిలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి మైనారిటీ నాయకుల అక్రమ అరెస్టు సరికాదు

పలమనేరు, నవంబర్ 28, ప్రభాతవార్త:

పలమనేరులోని టిడిపి మైనారిటీ నాయకుల అక్రమ అరెస్టు సరికాదని జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్ తెలిపారు. ఏలూరు జిల్లా నరసాపురంలో జరిగిన ముఖ్యమంత్రి సభకు వెళ్లిన ముస్లిం మహిళలు నల్ల చున్నీలతో పాటు బుర్ఖాలను అనుమతించకపోవడం పై సోమవారం టిడిపి మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టదలచిన జగన్ హఠావో బుర్ఖా బచావో నిరసన దీక్ష కార్యక్రమానికి తరలుతున్న మైనారిటీ నాయకులను అరెస్టు చేసి పోలీసులు పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనారిటీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

## తెదేపా కార్యాలయంలో పూలే వర్ధంతి

శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మహాత్మా పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, నాగరాజు, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, నాగరాజు, సింగిరి శ్రీనివాసులు, చంద్ర, నారాయణస్వామి, గోవిందరాజులు, భాస్కర్, ఆనంద్‌నాయుడు, చంద్రకళ, అనసూయ, సుగుణమ్మ, రూపహేమావతి, పొలారాణి, గోపాల్, రమేష్‌పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జగనన్న భూహక్కు పట్టాలు పంపిణీ



పట్టాలను అందజేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, నవంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జగనన్న హక్కు పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు ఈ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరిపాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు తాము అనుభవిస్తున్న భూములపై హక్కులు పొందేందుకు మార్గాన్ని సుగమం చేశారన్నారు. దేశ చరిత్రలోనే ఇటువంటి వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ భూహక్కు పథకం ద్వారా కొన్నేళ్లుగా తాము అనుభవిస్తున్న భూములకు లబ్ధిదారులు యజమానులయ్యే అవకాశం అందజేశారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న నవరత్నాల పథకాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని రాష్ట్రాన్ని సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రోజ్‌మాండ్, తహశీల్దార్ కె.రవికుమార్, వైసీపీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జెట్టి వేణుయాదవ్, తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వరిపంటలో ఆకుముడత తెగులు

### - నివారణ సూచనలిస్తున్న అధికారులు





తెగుళ్ల మందు పిచికారి చేస్తున్న రైతన్న, రైతులకు తెగుళ్ల నివారణ సూచనలిస్తున్న అధికారులు

తడ, నవంబర్ 28 ప్రభాతవార్త

తడ మండలంలోని పలు గ్రామాల్లో వరిపంటపై ఆకుముడత తెగులు, ఉల్లికోడు తెగులు వ్యాపించి రైతులను కష్టనష్టాలకు గురిచేస్తున్నాయి. ఇటీవల వర్షం వచ్చి అలా ఆగిందో లేదో ఇలా తెగుళ్ల పీడ పంట పొలాలపై ప్రభావం చూపుతోంది. పలు గ్రామాల్లో రైతులు తెగుళ్ల నివారణ మందులను పిచికారి చేసుకుంటున్నారు. కొంచెం ముందుగా వరినాట్లు వేసుకున్న పాముల కాలువ సమీపంలోని మాంబట్టు, వెండ్లూరుపాడు, కాదలూరు తదితర గ్రామాల్లో పంట పొలాలు తెగుళ్ల బారిన పడ్డాయి. మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి సోమవారం పలు గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడుతూ తెగుళ్ల నివారణ చర్యలు సూచించారు. ఆకుముడత తెగులు సోకిన పంటను పరిశీలించారు. కొన్నిచోట్ల ఉల్లికోడు తెగులు కూడా ప్రబలుతోందన్నారు. కొత్తగా మంచు ప్రభావం కారణంగా అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని, రైతులు తమను సంప్రదించి నివారణ మందులు పిచికారి చేసుకోవాలని ఆమె చెప్పారు. ఇదిలావుంటే ఇరకం, వేనాడు దీవులతో పాటు మరికొన్ని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలపై కూడా లేత దశలోనే తెగులు సోకినట్లు రైతన్నలు తెలిపారు.

## నాయుడుపేటలో జ్యోతిరావుపూలే వర్ధంతి

నాయుడుపేట, నవంబర్ 28 ప్రభాతవార్త

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పరితపించిన మహనీయులు జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా సోమవారం నాయుడుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు తెలుగుదేశం పార్టీ, బీజేపీ తదితర పార్టీల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైసీపీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ 786 రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు కిషోర్‌యాదవ్, బైనా మల్లికార్జునరెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ నాయకులు గందవల్లి సిద్దయ్య, కరింబాయి చెంచయ్య, కౌన్సిలర్లు దారా రవి, షబ్బీర్, నారాయణరెడ్డి, అశోక్‌కుమార్, వైసీపీ నాయకులు రాహుల్, రత్నశ్రీ, పాదర్తి హరినాథరెడ్డి, ముద్దపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## మట్టి విషయంపై సత్యవేడు వైకాపాలో రగడ



సత్యవేడు,నవంబర్ 28, ప్రభాతవార్త :సత్యవేడు ఎంపీడీవో ఆఫీసు సాక్షిగా మట్టి తరలింపు విషయంపై వైకాపా నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రధానంగా కాళమనాయుడుపేట ఎంపీటీసీ సభ్యుడు మోహన్ ఎర్రమట్టిని సమీప కాళమనాయుడు పేటకు కొంత మట్టిని తరలించారు. ఈ విషయంపై జడ్పీటీసీ భర్త చంద్రశేఖర్ రెడ్డి మట్టి తరలింపును అడ్డుకున్నారు. తాను పక్క రాష్ట్రాలకు మట్టిని తరలించలేదని, తన ఎంపీటీసీ పరిధిలోని గ్రామస్థుల అవసరాల కోసం తరలించానని చెప్పుకొచ్చారు. ఈ మట్టి తరలింపు పంచాయితీ వ్యవహారం ఎంపీడీవో కార్యాలయంలో రసాభసగా మారింది. చివరకు ఎంపీపీ భర్త సుశీల్‌కుమార్ రెడ్డి కలుగజేసుకుని పంచాయితీ నిర్వహించాల్సి దుస్థితి ఏర్పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్కడబడితే అక్కడ మట్టిని అమ్మేసుకోవడం, సమీప తమిళనాడుకు టిప్పర్ల ద్వారా తరలించడం పరిపాటిగా మారిపోయింది. ప్రశాంతంగా ఉన్న పల్లెసీమలు ఈ గ్రావెల్ క్వారీల వల్ల అనేక సమస్యలతో సతమతమౌవుతోంది. ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో వైసీపీ మీద పడే అవకాశాలు ఉన్నా...నేతలు మాత్రం నీది ఎంత పెద్దది...నాది ఎంత పెద్దది క్వారీలు అన్న విధంగా ముందడుగు వేయడం చర్చనీయాంశంగా మారిపోయింది.

### వైసిపి పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఖర్మ : గాలి భానుప్రకాష్



నగరి, నవంబరు 28 ప్రభాతవార్త : ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వ పాలన చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని బాధపడుతున్నారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఒక కల్యాణమండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలు వైసిపి పాలనలో ఇబ్బంది పడుతున్నారని ఏ ఒక్కరినీ వదలకుండా బాదుడే బాదుడు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. టిడిపికి సంబంధించి బూత్ స్థాయి నాయకులు ఓటర్ల జాబితాపై అవగాహన పెంచుకుని మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలని సూచించారు. అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశంతో జరుగుతున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి ఒక్కరిని వైసిపి దుర్మార్గ పాలనపై చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, నగరి, పుత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షులు రమేష్, గాలి జీవరత్నంనాయుడు తదితర నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తిరుపతిలో కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ ప్రారంభం



తిరుపతి నగరం, నవంబరు 28 ప్రభాతవార్త : తిరుపతి వీవీ మహల్ రోడ్డులో సోమవారం కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూంను శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి ప్రారంభించారు. శ్రీవారి సన్నిధిలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో యాజమాన్యం, సిబ్బంది వారి వ్యాపారాభివృద్ధి బాగుండాలని ఆకాంక్షించారు. మరో ముఖ్య అతిథి మేయర్ డాక్టర్ శిరీషా హాజరై మాట్లాడారు. కంచి పట్టు చీరలను కంచి రేట్లకే అందించడం అభినందనీయమన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యజమానులు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ మాట్లాడుతూ పెళ్లి పట్టు చీరల కోసం కాంచీపురం వెళ్ళాల్సిన పనిలేకుండా తిరుపతిలోనే అతి తక్కువ ధరలకు అందిస్తున్నా మన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, భానుప్రకాష్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, మంజునాథ్, పలువురు ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

### టాలీ కోర్సుకు అవగాహన ఒప్పందం

పుత్తూరు, నవంబరు 28 ప్రభాతవార్త : టాలీ కోర్సుకు సంబంధించి పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కామర్స్ విభాగం పట్టణంలోని గురుకృప ఐటి ట్రైనింగ్ సెంటర్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. టారీ ప్రైమ్ కోర్సుకు ప్రైవేటు రంగంలో డిమాండ్ వుండడం వల్ల ఈ కోర్సు అధ్యయనం చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు అందుబాటులో వున్నాయి. కోర్సులో అనుభవం వున్న ఐటి శిక్షణ సంస్థ డిగ్రీ కాలేజీ వాణిజ్య శాస్త్రం విద్యార్థులకు రాయితీతో కూడిన ఉత్తమ శిక్షణ అందించేందుకు ముందుకు రావడంతో ఇద్దరి మధ్య ఎంఒయు జరిగింది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ టాలీ ప్రైమ్ కోర్సు అధ్యయనం చేస్తే మంచి భవిష్యత్ వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ ఎం.రెడ్డినాయక్, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ ఎం.శ్రీనివాసులు, టాలీ ట్రైనర్ హరిహరన్ పాల్గొన్నారు.

### బడుగు బలహీన వర్గాలకై జ్యోతీరావ్ పూలే ప్రాణత్యాగం

**స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్**



చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాలకు ఎనలేని సేవలందిస్తూ ప్రాణత్యాగం చేసిన మహనీయుడు జ్యోతీరావ్ పూలే అంటూ స్వమాక్స్ సిఈఓ సగీతం విశ్వనాద్ కొనియాడారు. స్థానిక టవర్‌క్లాక్, వద్ద, స్వమాక్స్ కార్యాలయంలో సోమవారం జ్యోతీరావ్ పూలే 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్నవర్గ మహిళలకు విద్యావకాశాలను కల్పించడంలో పూలే సతీమణి సావిత్రిబాయితో కలసి విశిష్ట సేవలందించారని అన్నారు. అదేవిధంగా జ్యోతీరావ్ పూలే కమిటీ అధ్యక్షుడు కె.వెంకటముని అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు విశేష కృషి చేసినట్లు తెలిపారు. చంద్రగిరిలో బిసిలకు కమ్యూనిటీ హాల్ కొరకు స్థలాన్ని మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పూలే కమిటీ ప్రధాన కార్యదర్శి రాగూరి చంద్రశేఖర్, నాయకులు బండారు సుధాకర్, మస్తాన్, సి.ఎం.కేశవులు (డాక్యుమెంట్ రైటర్), సుబ్రమణ్యం యాదవ్, నరేష్‌కుమార్ నాయుడు, వెంకటాద్రి, తిలక్, హరి, స్వమాక్స్ సిబ్బంది అంజి, వెంకటేష్, హరికృష్ణ, విజయ్, మీనా, వినోద్, శివ, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌కు సత్కారం



తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన షేక్.సిరాజ్ బాషాను మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఉన్న మదరసాలో హాఫీజే ఖురాన్ మౌలానా నసీం అక్తర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సిరాజ్‌బాషా మాట్లాడుతూ మదరసాలు, మసీదులు, దర్గాలు, షాదీమహాల్‌ల అభివృద్ధికి కృషిచేస్తానని, మైనార్టీలకు ప్రభుత్వం తరపున అందాల్సిన పథకాలను సక్రమంగా అందించేలా చర్యలుతీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు షరీఫ్, అహ్మద్, షమీర్, మస్తాన్, బషీర్, వైఎస్ఆర్‌సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రానికి వాటర్‌ప్యూరిఫయర్ వితరణ



తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు అనేకమంది రోగులు వస్తుంటారు. అయితే ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పించడంకోసం పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ఇటీవల మండలనాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, భరత్‌రెడ్డిలు ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు వచ్చే రోగులకు అవసరమైన మంచాలు, దుప్పట్లు, అందించడంతోపాటు నెబులైజర్, షుగర్ పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు అందించారు. ఈనేపద్యంలో సోమవారం ఆరోగ్య కేంద్రంలో మంచినీటి సమస్య ఉందని తెలుసుకున్న మామిడిగుంట గ్రామానికి చెందిన వినోద్ ఆరోగ్య కేంద్రానికి సుమారు రూ.15వేలు విలువచేసే వాటర్‌ప్యూరిఫయర్‌ను అందించారు. కార్యక్రమంలో న్యాయవాది భక్తవత్సలనాయుడు, డిల్లీబాబు, అరుణ్ హాస్పిటల్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

### కలంకారి కళాకారులకు శిక్షణ కార్యక్రమం

శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త : కలంకారి కళాకారులకు గాయత్రి ఎడ్యుకేషన్ సొసైటీ మరియు డిసి హ్యాండిక్రాఫ్ట్ సౌజన్యంతో పట్టణంలోని బిపిఅగ్రహారంలో కలంకారీ కళాకారుల కోసం డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపును హైదరాబాదు నుంచి నిఫ్ట్ డిజైనర్ కె.అశ్విన్‌కుమార్ మరియు జాతీయ అవార్డు గ్రహీత మునిరత్నమ్మలు జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ 25రోజుల పాటు కలంకారీ కళాకారులకు సరికొత్త డిజైన్లు, మెటీరియల్స్ ఫినిషింగ్ మరియు మార్కెటింగ్ గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండీ క్రాఫ్ట్ అధికారిణి టి.నీతా, జాతీయఅవార్డుగ్రహీత విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు.

### అన్నదానం చేయడం పూర్వజన్మసుకృతం



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : అన్నదానం చేయడం పూర్వజన్మసుకృతం అని తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షు రాలు చక్రాల.ఉష అన్నారు. సోమవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తెలుగుమహిళల సారధ్యంలో భారీ కేక్‌ను కట్ చేయించారు. మహిళలందరితోకలసి సహ పంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి కె.రామకృష్ణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి టి.మునెమ్మ, పార్లమెంటు కార్య దర్శి భారతమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు మాధవి, పార్వతమ్మ, గౌసియా తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, మాజీ కేంద్రమంత్రి పనబాకలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి) తదితరుల మద్య భారీకేక్ కట్‌చేసి ఉషకు పుట్టినరోజుశుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంల పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

### ప్రతిపక్షం లేని నియోజకవర్గంగా తయారు చేయటమే లక్ష్యం : ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంను ప్రతిపక్షాలు లేని సామ్రాజ్యంగా తీర్చిదిద్దటానికి జనంతో మమేకమౌతున్నానని శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్త లను పార్టీలో చేర్చుకున్నారు. శ్రీకాళహస్తి మండలం పెనుబాక గ్రామానికి చెందిన యువకులందరూ తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు అధికారం కట్టబెట్టారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాను తన తనయుడు, తనయ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా యువతకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి పరిశ్రమలు రప్పిస్తున్నామన్నారు. మీకు అందుబాటులో ఉండే నాయకుడుగా తానుంటున్నానని మీ సమస్యలు నా సమస్యగా పరిష్కరిస్తున్నానని వివరించారు.

### 104 సేవలను గ్రామాలకు విస్తరించండి

విజయపురం, నవంబరు 28 ప్రభాతవార్త : 104 సేవలను పంచాయితీలకే పరిమితం చేయకుండా గ్రామాలకు కూడా విస్తరించాలని సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి జమున అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో ఉపాధి కూలీలు పనులు లేకుండా వున్నారని, అందరికీ పని కల్పించాలని విజయపురం దళితవాడ సర్పంచ్ జపమేరీ ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. వర్షాకాలం వల్ల కొంత జాప్యం జరుగుతోందని, అందరికీ పనులు కల్పిస్తామని ఎపిఒ బబిత తెలిపారు. మండలానికి అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, పిహెచ్‌సిలో కాన్పులు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. రైతులకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు అందిస్తు న్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి కోరారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. అనంతరం సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఇందిర, వైస్ ఎంపిపిలు దశరథ, మంజు బాలాజీ, ఎఇలు వీరభద్రం, చంద్రబాబు, ఎంఇఒ ఆంజనే యులు, ఎపిఎం ఉమాదేవి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవాలి : మాజీ ఎమ్మెల్యే



కేవీబీ పురం, నవంబరు 28 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే హేమలత సోమవారం కేవీబీ పురం మండలం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు స్వగ్రామం ఎంప రాజులకండ్రిగలో మర్యాదపూర్వకంగా వారిని కలసి ఆయనను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ గతంలో కేవీబీ పురం మండలం టీడీపీ పార్టీకి కంచుకోటలా ఉండిందని అలా మరలా మండలాన్ని పార్టీకి పూర్వ వైభవం తేవాలని ఆమె రామాంజులనాయుడుని కోరారు. రాబోవు ఎన్నికల్లో ఎలాంటి విబేధాలు లేకుండా వ్యక్తిగత విబేధాలకు తావివ్వకుండా పార్టీకి అందరం కృషి చేసి మరలా చంద్రబాబునాయుడుని మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా గెలిపించాలని తెలిపారు. ప్రతి గ్రామంలోను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కలసి వారి భాగోగులపై సమీక్ష చేస్తామని, పార్టీ కార్యకర్తలకు తమవంతు ఎప్పుడు వారికి అండగా నిలబడతామని మనలో ఏ ఒక్క కార్యకర్త కూడా వ్యక్తిగత విబేధాలకు తావివ్వకుండా పార్టీకి విజయానికి అందరం కృషి చేయాలని హేమలత ప్రతి కార్యకర్తను ఆమె పలకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు శివరావు, గోపినాథ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, లోకినాయుడు, వాసునాయుడు, హరి కరపారెడ్డి, చెంగారెడ్డి, నంది కేశవులనాయుడు, మాజీ సర్పంచ్ వీర రాఘవులు యాదవ్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ నాయకుడికి రోజా చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయం



పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: యువ నాయకుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంత్రి రోజా స్పందించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. పుత్తూరు మండలం కేబీఆర్ పురం దళితవాడకు చెందిన వైసీపీ యూత్ లీడర్ ఏ.బి.నేసర్ అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలోచికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నాడు. పార్టీ కోసం పని చేస్తున్న ఆ యువకుడు అనారోగ్యాన్ని గుర్తించి ఆదివారం రాత్రి మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చేరుకుని అతడిని పరామర్శించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. నేసర్ కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు శ్యామ్‌లాల్, ఏఎంసీ డైరెక్టర్ వడివేలు, అన్నా లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

### రామసముద్రం యువతకు క్రీడా పరికరాలు



పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: పుత్తూరు మండలం రామసముద్రం గ్రామానికి చెందిన యువతకు సోమవారం రోజా చారిటబుల్ ట్రస్టు సాయంతో క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. నగరిలోని వైసీపీ కార్యాలయంలో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా క్రీడా కిట్లను అందించారు. కార్యక్రమంలో రామసముద్రం సర్పంచ్ కుమార్, నాయకుడు రాజా పాల్గొన్నారు.

### శివయ్య సేవలో మంత్రి కుమారుడు



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కుమారుడు కొట్టు విశాల్ కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యుడు మున్నారాయల్, శాసన సభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డిలు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయంలో దర్శించుకున్నారు.ఏర్పాట్లును ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎపిఆర్‌ఓలు శ్రీనాథ్, బాలాజి,సూపరింటెండెంట్ విజయసారధిలు పర్యవేక్షించారు.

### వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్‌ను సత్కరించిన దర్గా కమిటి



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : తిరుపతిజిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్‌గా ఎంపికైన శ్రీకాళహస్తికి చెందిన ఎస్.సిరాజ్‌బాషాకు జుంలేపీర్ షావలి అల్లాహ్ వారి దర్గా కమిటి సారధ్యంలో సత్కరించారు. సోమవారం ఆయనకు దుశ్శాలు వలతో సత్కరించారు. మాట్లాడుతూ వైకాపాలో ఆది నుంచి ఉంటూ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుల్లో శ్రీకాళహస్తిలో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ఆచరిస్తున్న సిరాజ్ కుటుంబానికి పార్టీలో ఎంతో గుర్తింపు ఇచ్చారన్నారు.ఎవరికైనా అవసరం వచ్చినపుడు నేనున్నానని ముందుకు వచ్చే సిరాజ్‌బాషాకు బాధ్యత కల్గిన వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ పగ్గాలను అందించటం హర్షణీయం అని అభినందించారు.దర్గాకమిటి నాయకులు సయ్యద్ ఆహమ్మద్,బాబా,ఒరుగంటి నాగేశ్వర రావు, గరికపాటి రమేష్,రాజేశ్వరరావు,జమురుద్‌బాషా, పుదూరు శరత్‌బాబు, షేక్ కరీముల్లా, ముహమ్మద్ అన్సర్, బాబాజాన్, రహీంఖాన్, ముహమ్మద్ యాకూబ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

### ఎస్వీయూ యువజనోత్సవాల్లో ఎమరాల్డ్స్ విజయభేరి



తిరుపతి (విద్య), నవంబర్ 28 ప్రభాతవార్త : ఎస్వీ యూనివర్సిటీ వారు నిర్వహించిన యువజ నోత్సవంలో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వెస్ట్రన్ గ్రూప్ ప్రథమ, ద్వితీయ స్థానం, ఇండయన్ గ్రూప్ డ్యాన్స్ ప్రథమ స్థానం, స్కిట్ ప్రథమ స్థానం, డిబేట్‌ప్రథమస్థానం, ఒన్ ఎక్ట్ ప్లే ప్రథమస్థానం, ఫోక్ డ్యాన్స్ తృతియ స్థానం, మైమ్ తృతీయ స్థానం, వకృత్వ పోటీలు ప్రథమ స్థానం, కొల్లేట్ ప్రథమస్థానం, క్యాసికల్ ఓకెల్ ద్వితియ, తృతియ స్థానం అత్యధిక విభాగాలలో విజయం సాధించి విజయకేతనం ఎగురవేసారని కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్‌లు తెలిపారు. అనంతరం ఎమరాల్డ్స్ డైరెక్టర్లు మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువులతో పాటు క్రీడ, సాంస్కృతిక విభాగాలలో కూడా ఉన్నత శిఖరాలు చేరుకుని జీవితంలో గొప్పగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఉప సంచాలకులు మునిరత్నం, జానికి రామ్, నాథముని, పార్థసారధి, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్, వనీల గురవయ్యలు పాల్గొన్నారు.

### నాయకుని కాదు మీ సేవకుడిని : బియ్యపు



రేణిగుంట, నవంబరు 28 ప్రభాతవార్త: తాను ఎప్పటికీ నాయకుడిని కాదని ప్రజలకు సేవ చేసే సేవకుడినని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా సోమవారం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటికి తిరిగారు. వెళ్లిన ప్రతి చోట ప్రజలు ఆయనకు మంగళ హారతులతో గజమాలలు వేసి అపూర్వ స్వాగతం పలికారు. దారి పొడవునా మహిళలు పుష్ప వర్షం కురిపించారు. గడప గడపకు తిరిగిన ఆయన అందరి సమస్యలు తెలుసుకున్నారు. తూకివాకం వైకాపీ సీనియర్ నేత మాజీ ఎంపీటీసీ నాగసుబ్రహ్మణ్యంరెడ్డి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి పూలబొకేతో సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి వికేంద్రీకరణకు జగనన్న ప్రభుత్వం ఎప్పటికి కట్టుబడి ఉంటుందన్నారు. గడప గడపకు తిరిగిన వారిలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో హరిబాబు, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి, వైస్‌ఎంపీపీ సుజాత, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందరావు, తూకివాకం ఉప సర్పంచ్ శ్రీనివాసులు, రేణిగుంట వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం, కో-ఆప్షన్ నెంబరు సుభాన్‌రాజా, వైకాపా మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, ఉపాధ్యక్షుడు షబీర్ అహ్మద్, మండల వైకాపా మైనారిటీ జనరల్ సెక్రటరీ అలీ, వార్డు మెంబర్ ఇరానీ ఖాదర్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28 ప్రభాతవార్త : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా తిరుపతి బాలాజీ కాలనీ సర్కిల్ వద్దనున్న జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూల మాల వేసి మేయర్ శిరీష, బిసి సంఘర్షణ సమితి నిర్వహణ కమిటీ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం,మహిళా అభ్యున్నతికి పోరాడిన తత్వవేత్త, విద్యావేత్త, సామాజిక కోవిదులు జ్యోతిరావు పూలే చరస్మరణీయుడు అని ఆమె అన్నారు. మహారాష్ట్రలో 1827లో జన్మించిన జ్యోతిరావు పూలే ఉన్నత చదువులు చదువుకున్న తర్వాతసమాజంలో అస్పృశ్యత నివారణ మహిళల అభ్యున్నతి కోసం ఎంతో పాటుపడ్డారు. దళితులు మహిళలు ఉన్నత చదువులు చదువుకోవాలని విశ్వవిద్యాలయాలను ప్రారంభించిన మొట్టమొదట సంఘ సంస్కర్త అని తెలిపారు. 1874లో సత్యశోధక సమాజం అనే సంస్థను ప్రారంభించి అంటరానితనాన్ని రూపుమాపాలని ఆర్థిక అసమానతలను రూపుమాపాలని అందరితోపాటు మహిళలు కూడా ఉన్నత చదువులు చదువుకోవాలని అనేక ఉద్యమాలు తీసుకువచ్చాడు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిల అభ్యున్నతి కోసం అనేక వృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అందుకు మహాత్మ జ్యోతిరావు పూలే మార్గదర్శకులు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘర్షణ సమితి నిర్వహణ కమిటీ బుసగాని లక్ష్మయ్య యాదవ్, అధ్యక్షులు సాకం ప్రభాకర్, అధికార ప్రతినిధి అశోక్ సామ్రాట్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి లక్ష్మయ్య, కోఆర్డినేటర్ కట్టమంచి చంద్రబాబు యాదవ్, కోపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ యచ్చం వాసు యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

### సరికొత్త టైడ్ మ్యాటిక్ లిక్విడ్ డిటెర్జెంట్ విడుదల

తిరుపతి నగరం,నవంబరు 28 ప్రభాతవార్త : ప్రపంచంలోనే నెంబరు 1 డిటర్జెంట్ టైడ్ తమ పూర్తి సరికొత్త టైడ్ మ్యాటిక్ లిక్విడ్‌ను విడుదల చేసిందని పి అండ్‌జీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, వైస్ ప్రెసిడెంట్ ప్యాబ్రిక్ కేర్ శరత్ వర్మ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టైడ్ మ్యాటిక్ లిక్విడ్ సుపీరియల్ లిఫ్ట్ అండ్ లాక్ టెక్నాలజీ అత్యంత కఠినమైన మరకలను తొలగిస్తుంది. అదే సమయంలో వస్త్రాల రంగు తొలగించదు. బహుళ ఉతుకుల తర్వాత ఆ వస్త్రాల రంగు ఆకర్షణీయంగా ఉంచేలా చేస్తూనే మరింత మెరుగైన ఉతుకు అందిస్తుందన్నారు. తమ వస్త్రాపై పడిన కఠిన మరకులు పోగొట్టుకునేందుకు గృహ చిట్కాలు వినియోగించడం, మరక ఉన్న చోట పదే పదే ఉతకడం వలన ఆ వస్త్రాలు త్వరగా పాడవడం జరుగుతుంది. రోజువారీ వాడే వస్త్రాలు, ఖరీదైన వస్త్రాలైనా సరే టైడ్ మ్యాటిక్ లిక్విడ్ ఈ సమస్యలన్నింటికీ తగిన పరిష్కారాలను చూపుతుందన్నారు. ప్రపంచలో నెంబరు 1 డిటర్జెంట్ బ్రాండ్ టైడ్, ఇప్పుడు నూతన టైడ్ మ్యాటిక్ లిక్విడ్ డిటర్జెంట్‌ను రంగులు పోకుండానే కఠినమైన మరకలను పోగొట్టే రీతిలో తీర్చిదిద్దాము. టైడ్ మ్యాటిక్ లిక్విడ్ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఫ్లోర్లు ఈ -కామర్స్ వెబ్‌సైట్‌ల వ్యాప్తంగా లభ్యమవుతుంది. ఏదీనిని టాప్‌లోడ్, ఫ్రంట్ లోడ్ కోసం డిజైన్ చేయడం జరిగింది. ఇది 850 మిల్లీ లీటర్లు 22 లీటర్లలో లభ్యమవుతుందన్నారు. దీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### డా॥పిసి.రాయలుచే అమ్మవారికి బంగారు పతకం కానుక



తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 28 ప్రభాతవార్త: తిరుపతికి చెందిన కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ మరియు డా॥వైఎస్ఆర్ ప్రజా ప్రస్థానం సేవా ట్రస్టుల చైర్మన్ డా॥పిసి.రాయలు చేతుల మీదుగా 5 లక్షల 50 వేల రూ॥ల వ్యయంతో 117 గ్రాముల బంగారంతో తయారు చేయించిన పతకాన్ని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి కానుకగా అందచేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ దాము,ఆలయ ప్రధాన అర్చకులు బాబుస్వామిలకు తన చేతుల మీదుగా అందచేశారు.ఈ సందర్భంగా వీరికి ఆలయ మర్యాదల ప్రకారం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి,వేద మంపంలో వేదాశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు,శేష వస్త్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో డా॥పిసి.రాయలు కుటుంబ సభ్యులు,ట్రస్టు డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి,ట్రస్టు సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

### అసమానతల నిర్మూలనకు పూలే కృషి



తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 28 ప్రభాతవార్త: సమాజంలో అసమానతల నిర్మూలనకు మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు వి.ఎన్.బాబు,కె.ఎస్.శివప్రసాద్‌రెడ్డిలు పేర్కొ న్నారు. డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు,నిమ్న కులాల ప్రజలకు ఎదురయ్యే సాంఘిక దుశ్చర్యలపై జ్ఞానోదయాన్ని కల్పించేందుకు పూలే కృషి చేశారన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని కొనియాడారు.ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే 1851వ సం॥లో బాలికల కోసం ఒక పాఠశాలను నెలకొల్పి,ఆ విద్యార్థినులకు పాఠాలను బోధించారని అన్నారు. ఆయన భారతదేశంలో ప్రముఖ సంఘసంస్కర్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్.వరకుమార్,వి.సురేష్,వై.లక్ష్మి నరసయ్య, కెఆర్ఎస్. ధర్మజ్ఞాని,గురవయ్య,జనరల్ మేనేజర్లు ఆదిశేషయ్య,రవి,సురేంద్రరావు,చంద్రశేఖర్‌రావు,డిప్యూటీ జనరల్ మేనేజర్లు ప్రసాద్,వెంకటరాజు,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీకాంత్,బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చలపతి,వేణు,జగదీస్,మధు,తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికుల్ ప్రైవేటు వారి కోసం షార్‌లో మినీ లాంచ్ పాడ్



శ్రీహరికోట/తడ, నవంబర్ 28 ప్రభాతవార్త: అంతరిక్ష పరిశోధనలో భారత్ ప్రైవేటు వారికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇటీవల మొట్ట మొదటి ప్రైవేట్ రాకెట్‌ను శ్రీహరి కోట నుంచి విజయవంతంగా



ప్రయోగించారు. ఇక్కడ ఇస్రో వారి సౌండింగ్ రాకెట్ ప్రయోగ వేదికను స్కై రూట్ వారు ఉపయోగించుకున్నారు. అయితే ఇప్పుడు చెన్నైకి చెందిన అగ్నికుల్ స్టార్టప్ సంస్థ వారు తాము తయారు చేసిన రాకెట్‌ను వారి సొంత ప్రయోగ వేదిక నుంచి త్వరలోనే ప్రయోగించనున్నారు. భారత్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో సముద్ర తీరాన ఇస్రో వీరికి కొంత స్థలం కేటాయించింది. అక్కడ చిన్న ప్రయోగ వేదిక మినీ కంట్రోల్ సెంటర్‌లు రూపొందించుకున్నారు. వీటిని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమ నాథ్ ప్రారంభించారు. డిసెంబర్ నెలలో అగ్నికుల ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగంలో కీలక పాత్ర పోషించే రాడార్లు వంటి సాంకేతిక అవసరాలను ఇస్రో.., షార్ వారే అందించనున్నారు. మొత్తం మీద ప్రైవేటు రాకతో ఇస్రో వర్గాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవతున్నాయి.

## ఆరోగ్యశ్రీలో... మారుతి ఆస్పత్రిసేవలు బాగున్నాయి

**- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు**



తిరుపతి నగరం, నవంబరు 28 ప్రభాతవార్త : స్థానిక శ్రీ మారుతీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అక్కడ ఉన్న రోగులతో ముఖాముఖి మాట్లాడారు. స్కీం ద్వారా అందుతున్న వైద్య సేవలు, మందులు, భోజన వసతి, ఆసరా గురించి అక్కడున్న రోగులను, రోగుల సహాయకులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మారుతి ఆస్పత్రిలో ఆర్థోపెటిక్ పాలిట్రామా, న్యూరో సర్జరీ, యూరాలజీ, ఫ్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ, పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని మెడికో డాక్టర్ నవీన్‌బాబు అధికారులకు వివరించారు. స్కీంలో కొత్తగా చేర్చిన టోటల్ హిప్‌రేప్లేస్మెంట్‌ను ఉచితంగా అందిస్తామని తెలియ జేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారుల్లో ప్రధానంగా డాక్టర్ రామమూర్తి ఈవో-ఈహెచ్ఎస్, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య హెల్త్ కేర్ ట్రస్ట్ డాక్టర్ ఎన్.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కె. శివకుమార్, జిల్లా మేనేజర్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులతో పాటు ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడండి..సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు ఉండి వాటిని పరిష్కరించే దిశగా చర్యలుతీసుకోవాలని నియోజక వర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌టిఎస్ మరియు రాబిన్‌శర్మ టీంతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఇదేం కర్మ' కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుసి సిఎం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తారా లేదా అన్నది తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి పనబాకలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతి నాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు, కామేష్‌యాదవ్, మునిచంద్రారెడ్డి మరియు క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, రాష్ట్ర కార్యదర్శులు, తిరుపతి పార్లమెంటు కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు వివిధ అనుబంధ కమిటీ సభ్యులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా కార్తీక దీపారాధన



కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈమేరకు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయం మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి : కలెక్టర్



చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం కలెక్టర్ హరి నారాయణన్ ఇళ్ళ నిర్మాణాల వేగవంతంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ళ నిర్మాణాల కోసం 610 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 53 వేల ఇళ్ళ నిర్మాణాలను చేపడుతున్నామని వీటి నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంను పూర్తి చేయడం ఉద్యోగులుగా మన కర్తవ్యం అన్నారు. గత వారం 7 కోట్ల రూపాయల ఖర్చు లక్ష్యంగా నిర్దేశించగా 5.4 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారన్నారు. లక్ష్య చేధనలో వెనకబడిన పూతల పట్టు, నగరి, కుప్పం నియోజకవర్గాల ఇంజనీరింగ్ అధికారులను కారణాలను అడిగారు. అధికారులకు ఈ వారం లక్ష్యాలను నిర్ధేశించిన కలెక్టర్ కొత్తగా మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలను సైతం స్టేజీల వారీగా త్వరితంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, హౌసింగ్ పిడి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించండి

తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: స్పందన కార్యక్రమాన్ని వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 68 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖ సంబంధించి-56, పంచాయతీరాజ్‌కు సంబంధించి 03, పోలీసు శాఖ 01, విద్యా శాఖ 01, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ 02, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ 02, ఆర్ అండ్ బి 01, డ్వామా 01, విద్యుత్‌శాఖకు సంబంధించి-01 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు వచ్చిన అర్జీలపై సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తిరుపతి వాసులకు 20 మెడల్స్

తిరుపతి(క్రీడ), నవంబరు 28 ప్రభాతవార్త ః జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి సారిగా తిరుపతి వాసులు 20 మెడల్స్ సాధించారు. కృష్ణాపురం రుష్మిత సబ్ జూనియర్‌లో స్వర్ణం, రజితం సాధించింది. కృష్ణాపురం మౌనిక జూనియర్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించింది. అనూష జూనియర్‌లో 50 కేజీల విభాగంలో స్వర్ణం, రజితం సాధించింది. సి. చరణ్ తేజ సబ్ జూనియర్‌లో 59 కేజీల విభాగంలో రెండు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించాడు. జె. జీవనాదం వెంకటనాధన్ 59 కేజీల విభాగంలో ఒరెండు స్వర్ణాలు సాధించాడు. బి. లక్ష్మి పతి 60 కేజీల విభాగంలో ఒక రజిత పతకం సాధించాడు. ఎస్. ఇంతియాజ్ ఆలి 60 కేజీల విభాగంలో ఒక స్వర్ణం, ఒక రజితం, ఒక కాంస్యం పతకం సాధించాడు. జె. హరీష్ కుమార్ 75 కేజీల విభాగంలో ఒక రజితం, ఒక కాంస్యం సాధించాడు. బి. కుమార్ 80 కేజీల విభాగాలలో రెండు స్వర్ణాలు సాధించాడు.

# న్యాయస్థానం ఆదేశాల మేరకు మ్యుటేషన్ చేయండి...మేడమ్



తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: న్యాయస్థానం ఆదేశాల మేరకు దామినేడు లెక్కదాఖల సర్వేనంబర్ 92-2లో గల 66 సెంట్ల భూమిని తమ కుటుంబ సభ్యుల పేరిట మ్యుటేషన్ చేయాలని ఆ భూమి హక్కుదారుడు మండ్యం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేసారు. సోమవారం వెంకటరమణారెడ్డి తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయం ముందు నిలబడి, కోర్టు ఆదేశాలను చూపుతూ నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దామినేడు లెక్కదాఖల సర్వే నెంబర్ 92-2లో వున్న 1.66 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమిలో ఎ.ఎం. అబ్బాస్ కుటుంబ సభ్యుల ద్వారా 1981లో ఎం. ఎం.వెంకట రమణారెడ్డి, ఎం.భాగ్యలక్ష్మీ, ఇతరుల ద్వారా 1983లో ఎం.వెంకటమునిరెడ్డి, ఎం.వెంకటసుబ్బారెడ్డిలు 66 సెంట్ల భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తాము కొనుగోలు చేసిన 66 సెంట్ల భూమితో పాటు అదే సర్వేనెంబర్‌లో వున్న మిగతా 1ఎకరా భూమిని కూడా కొంత మంది వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించుకుని తమ పేరిటి మ్యుటేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. తమ కుటుంబ సభ్యులకు చెందిన భూమిపై ఎం.భక్తవత్సలనాయుడు, వై.సురేష్‌బాబు, బత్తల గిరిబాబు, ఎస్.షకినాబీ, ఎస్.మహబూబ్ భాషలు ఆ తమదంటూ దౌర్జన్యం చేయడంతో పాటు 1972లో తమకు రిజిస్ట్రర్ అయ్యిందని, తప్పుడు డాక్యుమెంట్లతో వీరంగం చేస్తున్నారని వాపోయారు. దామినేడు లెక్కదాఖల సర్వే నెంబర్ 92-2కు చెందిన భూ వివాదం కోర్టు నడుస్తున్నప్పటికీ నకిలీ డాక్యుమెంట్లతో, నకిలీ ఆథార్ కార్డులు సృష్టించుకుని 26-10-22న రేణిగుంట రిజిస్ట్రర్ కార్యాలయంలో బత్తల గిరిబాబు, బి.వెంకటస్వామి నాయుడులపై రిజిస్ట్రర్ కాబడిందన్నారు. నకిలీ డాక్యుమెంట్లతో చేసిన రిజిస్ట్రేషన్ చెల్లదని న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందని, న్యాయస్థానం పరిధిలో ఉన్న భూమిని వారి పేర్లపై ఆన్‌లైన్ చేసారన్నారు. భూ వివాదం కోర్టులో నడుస్తున్నప్పటికీ కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ రిజిస్ట్రేషన్ చేసారని ఆవేదన వ్యక్తం చేసారు. నకిలీ డాక్యుమెంట్లతో నకిలీ ఆథార్ కార్డులు, నకిలీ ఫ్యామిలీ సర్టిఫికేట్ ద్వారా రిజిస్ట్రర్ కాబడిన భూమిని న్యాయస్థానం ఆదేశాల మేరకు తమ కుటుంబ సభ్యుల పేరిట మ్యుటేషన్ చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ లోకేశ్వరిని కలిసి కోర్టు ఆదేశ పత్రాన్ని అందించారు. 40 సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న భూమిని అన్యాయంగా లాక్కొనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై తహశీల్థార్ మాట్లాడుతూ పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు

# గ్రామాభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి

**రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా**



నింద్ర,నవంబరు28 ప్రభాతవార్త :గ్రామాబివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు.సోమవారం మండల కేంద్రంలోని కెఆర్ పాలెం గ్రామపంచాయితీలో రాష్ట్ర ప్రభుత్వం డిబిటి ద్వారా పేదలికి అందజేసిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్దిదారులకు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా చేతుల మీదగా అందజేసారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రుపంలో సహాయం అందజేస్తున్నరని తెలిపారు.గతంలో రాష్ట్రంలో పరిపాలన చేసిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామిలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శించినారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అబివృద్ధి చెందాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజదానులు తీసుకొని వస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 29 గ్రామాలే రాజధాని అని రియల్ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించినారు.పేదలకు సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తావుంటే టిడిపి నాయకులు నారా చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అందజేయడం వలన రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని విమర్శిస్తావుండారని తెలిపారు.ఈకార్యక్రమంలో తహశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు,యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్టారెడ్డి,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,యంపిటిసిలు విజయ,విజేష్,వెలుగు ఎపియం చంద్రకళ,సిడిపిఓ శోభారాణి, నాయకులు గోపి,మహేష్, రామచంద్రారెడ్డి, తోయజాక్షి, సంపత్‌కుమార్, బాబురెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సత్యరాజ్ తదితరులు పాల్గోన్నారు.

## గ్రామీణ స్వరాజ్య సాధనే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి రోజా

విజయపురం, నవంబరు 28 ప్రభాతవార్త : గ్రామీణ స్వరాజ్య సాధనే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. సోమవారం మండలంలోని పన్నూరులో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధి కలలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. గతంలో విధంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల ముంగిటకు పాలన వచ్చేలా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సిఎం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జమున, వైస్ ఎంపిపిలు దశరథ, మంజు బాలాజీ, ఎంపిడిఓ ఇందిర, పిఆర్ ఎఇఇ వీరభద్రం, ఆర్బికె ఛైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబు, ఎంపిటిసి రాజమ్మ, సర్పంచ్‌లు సునంద మనోహర్‌రెడ్డి, కుమార్, నాయకులు కిషోర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, శివరాజు, జిల్లు, అనందన్, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచమితీర్థం సందర్భంగా 25 వేల మందికి మహా అన్నదానం

**-సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వితరణ**



తిరుచానూరు,నవంబర్ 28 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు విశిష్టమైన పంచమితీర్థం రోజున తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 25 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.పంచమితీర్థం రోజున ప్రతి ఏడాది లక్షల్లో భక్తులు వస్తుంటారు. వారికి సర్పంచ్ రామచంద్రారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనావాయితీగా వస్తోంది. సోమవారం చక్రస్నానం అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అన్నప్రసాదాలను అందచేశారు.అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో ప్రతి ఏడాది పంచమి నాడు భక్తులకు అన్నదానం చేయడం ఆ పద్మావతి అమ్మవారికి సేవ చేయడమేనన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు,ఎంపిటిసిలు నరేష్‌రెడ్డి,శేఖర్‌రెడ్డి,వార్డు మెంబర్లు మునీంద్ర రాయల్,యాగ నాయక్,వాసు,పసుపు చంద్ర,డిష్ చంద్ర,ఆర్ఆర్ యూత్ ప్రెసిడెంట్ మోహన్,కిషోర్,వాసు చెంగా,వెంకటేష్,మైనార్టీ సెల్ నాయకుడు అబ్దుల్,వాసు రాయల్,సుబ్రహ్మణ్యం రాజు,పెద్ద సంఖ్యలో ఆర్ఆర్ యూత్ పాల్గొన్నారు.

## విజయవంతంగా అమ్మవారి పంచమితీర్థం

**-భక్తులకు చిన్న ఇబ్బంది కూడా లేకుండా ఏర్పాట్లు -టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి**

తిరుచానూరు,నవంబర్ 28 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో మైఖ్యమైన పంచమితీర్థం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించామని టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు.సోమవారం పంచమితీర్థం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.ఈనెల 20 నుండి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యి సోమవారం పంచమితీర్థంతో ఘనంగా ముగిశాయన్నారు.పంచమితీర్థం కార్యక్రమంలో లక్ష మందికి పైగా భక్తులు హాజరయ్యి పుణ్యస్నానాలు చేశారన్నారు.ఇందుకు తగ్గ ఏర్పాట్లను చేశామన్నారు.తిరుపతి,పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా తమిళనాడు నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం రాత్రికే తిరుచానూరు చేరుకున్నారని తెలిపారు.కరోనా కారణంగా రెండేళ్ల తరువాత జరిగిన పంచమితీర్థానికి శేషంగా భక్తులు వస్తారని టిటిడి ముందే ఊహించి అందుకు తగ్గ ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు.వారికి ఆదివారం రాత్రి నుండే అన్నప్రసాదాలు,కాఫీ,టీ,పాలు,మంచినీరు అందించామన్నారు.షెడ్ల నుండే నేరుగా పుష్కరిణికి చేరుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.అలాగే జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుని ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పవిత్రమైన కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేసిన టిటిడి అధికారులు,సిబ్బందిని ఆయన అభినందించారు.

## కుప్పంలో 2న జాబ్ మేళా

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 2వ తేదీ కుప్పంలోని ఎంఎఫ్‌సి జూనియర్ కళాశాలలో నిరుద్యోగు యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం కలెక్టర్ హరినారాయణన్ డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో 18-35 సంవత్సరాల యువతీ యువకులు టెన్త్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదవిన నిరుద్యోగులు హాజరై ఉద్యోగ అవకాశంను పొందవచ్చుని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్ఎంఎం ఎం.సరితారెడ్డి,, డిఎస్‌డిఎ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వస్తుందో ..రాదో.. తెలియదు.. చెప్పలేం!!



కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త : వస్తుందో.. రాదో.. తెలియదు.. చెప్పలేం.. ఇది కుప్పం డిపో ఆర్టీసీ బస్సులకు సరిగ్గా ఆర్టీసీకి ఆంగ్లంలో బదులు తెలుగులో సరిపోయే అర్థంగా ఇటీవలి కాలంలో మారింది. అసలు ఏ బస్సు ఎప్పుడు వస్తుందో, వస్తుందో రాదో చెప్పలేని స్థితి నెలకొంది. సోమవారం కుప్పం పట్టణం ఆర్టీసీ బస్టాండులోకి ప్రవేశించే లింక్ రోడ్డు వద్ద కుప్పం - వాణియంబాడి మధ్య తిరిగే ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. దీంతో అక్కడున్న స్థానికులు పట్టర..పట్టు.. హైలెస్సా అంటూ బస్సును తోస్తూ స్టార్ట్ చేశారు. మరో పక్క కుప్పం నుంచి గుడుపల్లె మీదుగా సంగనపల్లి వెళ్లే బస్సు సైతం మార్గ మధ్యంలో ఆగిపోయింది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడినట్లు వాపోయారు. కుప్పం డిపో పరిధిలో ఉన్న బస్సులు కొన్ని ఇతర డిపోలకు వెళ్లిపోగా ఇతర డిపోల నుంచి ఇక్కడకు వచ్చిన బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కుప్పం డిపోలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

## కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**-576 మద్యం ప్యాకెట్లు,ఓ కారు సీజ్**

పలమనేరు,నవంబర్ 28,ప్రభాతవార్త: కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సుబ్బారెడ్డి సిబ్బందితో దండపల్లె క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారని ఈ క్రమంలో పలమనేరు పట్టణం రఘువీరా రెడ్డి కాలనీకి చెందిన శీను(32) టాటా నానో కారులో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు.ఈ మేరకు అతని వద్ద నుండి 90ఎంఎల్(చీప్ లిక్కర్ టెట్రా ప్యాకెట్లు)576 ప్యాకెట్లను,ఓ కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసి మాజీ జడ్పీ ఛైర్మన్



బంగారుపాళ్యం, నవంబర్ 28 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా కుమార్‌రాజాను రాష్ట్ర వైకాపా అధిష్టానం నియమించింది. తనకు ఇన్‌ఛార్జీ పదవి ఇచ్చినందుకుగాను మంత్రిని కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రితో పాటు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబులకు మాజీ జడ్పీ ఛైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, రాష్ట్ర ఈడిగ కొర్పొరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప, జిల్లా వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డిలు వున్నారు.

## సిఎంను కలిసిన తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి



వాకాడు, నవంబర్ 28, ప్రభాతవార్త : తాడేపల్లిలోని సిఎం క్యాంప్ ఆఫీస్ నందు సోమవారం ఏపి సిఎం జగన్‌మోహన్ రెడ్డిని తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ పుష్పగుచ్చం అందజేసి, మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సిఎం నేదురుమల్లి రామ్ కుమార్‌తో మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు సంబంధించి తిరుపతి జిల్లాలో తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేసారు.

## పూడి చెరువులో క్షుద్రపూజల కలకలం

తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని పూడి గ్రామంలో ఉన్న జూగుంట చెరువులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్ళు కనిపించాయి. గ్రామంలోనిజూపూడి చెరువులో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మట్టితో ఓ పెద్ద బొమ్మను ఏర్పాటుచేసి చుట్టు కర్రలు పెట్టి పూజలు చేయడం కలవరపరుస్తోంది. దీంతో గ్రామంలోని జనం కూడా భయాందోళనకు గురవుతున్నారు. పూజలు నిర్వహించిన పక్కనే స్పిక్ యూరియా ఉన్న చిన్నపాటిగోతాములు, ఓ లుంగీ ఇతర వస్తువులు చూస్తే కలవరపెడుతోంది. అయితే ఎంతమంది వ్యక్తులు వచ్చారు ఎందుకు పూజలు చేశారో తెలియడం లేదు. సోమవారం ఉదయం కొందరు చెరువు వద్దకు వెళ్ళిన గ్రామస్తులు ఈదృశ్యాన్ని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఇటీవల రాజీవ్‌నగర్ సమీపంలోని శివనాథపాళెం గ్రామానికి వెళ్ళే మార్గంలో కూడా క్షుద్రపూజలు నిర్వహించడం కలకలం రేపిన విషయం విదితమే.

## యుద్ధప్రాతిపదికన విద్యుత్ నిర్మాణ పనులు

**ప్రమాద నివారణకై ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె**

**ఏపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆయూబ్ ఖాన్**

చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: విద్యుత్ నిర్మాణ పునులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఏపిఎస్‌పిడిసిఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఆయూబ్ ఖాన్ ఆదేశించారు. తొండవాడ జగనన్న కాలనీలో సోమవారం ఆయన విద్యుత్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి ఇక్కడ నివశిస్తున్న లబ్దిదారులకు సర్వీసులు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా కాలనీలో ఏర్పాటు చేసే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె వేసి ప్రమాదాలను నివారించాలన్నారు. ముఖ్యంగా జగన్న కాలనీలో నూతనంగా నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికీ మీటర్, సర్వీస్ వైర్, బోర్డు, మెయిన్ స్విచ్, జిఐ పైప్ ఎర్తింగ్ వంటివి ఉచితంగా అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టి సామూహిక గృహ ప్రవేశాల నాటికి పూర్తి చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వాసురెడ్డి, డిఈఈలు పి.శేషాద్రి రెడ్డి, ఈశ్వర ప్రసాద్, ఏఈలు వై.నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించండి: మేయర్, కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28, ప్రభాతవార్త : స్పందనలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అధికానులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు పలువురు ఫోన్ ద్వారా సమస్యలు తెలుపగా, కొంత మంది నేరుగా వచ్చి మేయర్, కమిషనర్‌లకు వినతులు అందజేసారు. గతవారం ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఏ మేరకు పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇండ్ల ముందు అక్కడక్కడా చెత్త ఉంటోంది తొలగించాలని, రోడ్డులో గుంతలు పూడిపించాలని, పందులు బెడద తొలగించాలని, డ్రైనేజి కోసం తవ్విన గుంతలు పూడ్చాలని కోరారు. టిడ్కో పథకంలో ఇంటి కొరకు నగదు చెల్లించామని నగదు ఇవ్వాల్సిందిగా కోరగా ప్రభుత్వానికి లెటర్ పెట్టామని త్వరలోనే వస్తుందని తెలిపారు. ఒంటరి మహిళ పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకున్నామని ఇంకాపింఛన్‌రాలేదని తెలుపగా మీరు అర్హులయ్యారని త్వరలోనే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అదనపు కమిషనర్ సునిత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్స్ కెఎల్ వర్మ, సేతుమధవ్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ చిట్టిబాబు, కార్యదర్శి రాధిక, ఏసిపిలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డిఈలు, సానిటరీ సూపర్‌వైజర్స్, ఫైర్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.